క్లుప్తంగా

విద్యా సామర్థ్యాలను పెంచాలి



కేజీబీవీ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఎంపీడీఓ

బలిజిపేట: విద్యార్థులలో విద్యా సామర్థ్యాలను మరింత పెంచాలని ఎంఈఓ 1 ఎస్.సింహాచలం అన్నారు. వంతరాం కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించి బడి తోటను బాగా పెంచాలని సూచించారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారానికి సంబంధించిన కూరగాయలు, ఆకుకూరలను పెంచాలన్నారు. విద్యార్థుల విద్యా విషయక అంశాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను ఉపాధ్యాయుల హాజరుపట్టీని పరిశీలించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

సాలూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన భారత్ బంద్‌లో భాగంగా మాలమహానాడు నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేసారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకుడు గొంప ప్రకాశరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు సింగారపు ఈశ్వరరావు, గండిపల్లి రాము, ముగడ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్‌మోహన్‌రావు



వెల్నెస్ కేంద్రాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: హెల్త్–వెల్నెస్ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు సూచించారు. చినబొండపల్లి, ఎంఆర్ నగరంలో వెల్నెస్ కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు కేంద్రంలో వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు, ప్రతీ రోజూ ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు తదితర వివరాలను రికార్డులో పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరును గమనించారు. చికిత్స వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతుందో, ప్రతీ రోజూ మందులు వేసుకుంటున్నారా.. లేదా.. అని వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యానికి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాస పడకుండా వెల్నెస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

అన్ని గ్రామాల్లో గ్రామసభలు రేపు

గరుగుబిల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి బుధవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ సభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గ్రామాలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికలను రూపొందించనున్నట్టు తెలిపారు. సభలకు సంబంధించి ఇప్పటికే మండల స్థాయి అధికారులను నియమించామన్నారు. ప్రజలు పాల్గొని అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు.

మొక్కలు నాటిన కేవీకే శాస్త్రవేత్తలు



రస్తాకుంటుబాయి కేవీకేలో పండ్ల మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయిలో గల ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఎస్.శ్రీనివాసరాజు, అనంత విహారి, ఎస్.స్రవంతి తదితరులు బుధవారం 40 రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏక్‌పెడ్ మాకినాం కార్యక్రమంలో భాగంగా మామిడి, పనస, సపోట, దానిమ్మ తదితర మేలైన రకాల మొక్కలను నాటినట్టు చెప్పారు.

రద్దీ రహదారిపై ఆక్రమణల పర్వం

అసలే జిల్లా కేంద్రం.. ఎలాగూ రహదారిపై వాహనాల రద్దీ ఉంటుంది. ట్రాఫిక్ సమస్య షరామామూలే...ఈ పరిస్థితులు చాలదన్నట్టు రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, పెద్ద పెద్ద షాపుల వారు రహదారిపైకి వచ్చి కొంత మేరకు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో రద్దీ రహదారి మరింత ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందంటూ స్థానికుల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు తప్పని అవస్థలు
- డబుల్ రోడ్డు సింగిల్ రోడ్డుగా మారుతున్న వైనం



రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం – రాయగడ జాతీయ రహదారి క్రమేణా ఆక్రమణలకు గురవుతోంది. పార్వతీపురం పట్టణ రహదారిపై స్థలాల (రోడ్డు పక్కన)ను ఆక్రమించడంతో రోడ్డు రాను రాను కుదించుకుపోతోంది. అసలే రద్దీగా ఉండే ప్రాంతం. దీనికితోడు ఆక్రమణల పర్వం మరింతగా జనాలను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆక్రమణల వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడి రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. వీటి గురించి అడిగే నాథుడు కరువయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు ప్రస్తుతం ఉన్న రహదారినే పార్కింగ్‌కు వినియోగించుకోవాల్సి వస్తోంది.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రస్తుతం ఈ రహదారి పురపాలక సంఘ పరిధిలో ఉంది. ఈ రోడ్డు ఆక్రమణల గురించి ఆ శాఖ అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. కనీసం ఫిర్యాదు చేద్దామన్నా వారు అందుబాటులో లేకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు. షాపింగ్ మాల్స్‌కు సెల్లార్ పార్కింగ్ లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సింగిల్ రోడ్డుగా మారుతున్న దుస్థితి

ఇప్పుడు డబుల్ రోడ్డుగా ఉన్న రోడ్డు కాస్తా సింగిల్ రోడ్డుగా రోజురోజుకు కుదించుకుపోతోంది. కొందరు తమ దుకాణాలను ముందుకు తీసుకొచ్చి ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. గతంలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య ఉండేటప్పుడు అక్రమ నిర్మాణాలను తొలగించిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ నిర్మాణాలు రహదారిపై ముందుకొచ్చేశాయి. ఆక్రమణలతో బీఎస్ఎన్ఎల్ సమీపంలో, కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారిపోయింది. దీంతో తరచూ వాహనాల రాకపోకలు కష్టమవుతున్నాయి. ఓ వైపు ఆటోలు, మరో వైపు బస్సులు రాకపోకలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలో పలు దుకాణాలు ఏకంగా రోడ్డుపైకి నిర్మాణం చేపట్టి ముందుకొచ్చారని ఆరోపణలు ఉన్నాయి. అక్కడే ఆటోలు నిలబెట్టడం, దీంతో రోడ్డు ఇరుకుగా మారిపోయి ఒక్కోసారి వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి.

అనుమతులు ఎలా ఇచ్చారు..



పార్కింగ్ లేకుండా షాపింగ్ మాల్స్‌కు అనుమతులు ఎలా ఇచ్చారు. వందలాది వాహనాలు రహదారిపై పార్కింగ్ చేయడంతో పార్వతీపురంలో రహదారి స్వరూపమే మారిపోయింది. రోడ్డు విశాలంగా లేదు. ఫలితంగా ప్రమాదాలు నెలకొంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. ఈ సమస్య పరిష్కారంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి. రోడ్డు నిర్మాణంలో తొలిత ఎలా ఉందో అలాగే ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది.

– గులిపిల్లి మాధవనాయుడు, పార్వతీపురం పట్టణం

ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది



ట్రాఫిక్ సమస్య వాహనదారులను పట్టి పీడిస్తోంది. అడగడుగునా వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారి పైనుంచి పాత బస్టాండ్ చేరుకోవాలంటే ప్రమాదకరంగా మారింది. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద మరీ దారుణంగా తయారైంది. రహదారిపై ప్రయాణం అంటే భయంగా ఉంది. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

– ఎస్.సత్యనారాయణ, పార్వతీపురం పట్టణం

ఆక్రమణలపై చర్యలు చేపడతాం..

మున్సిపాలిటీలో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారులు ప్రభుత్వ స్థలాల్లోకి రాకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



హోం కంపోస్టు విధానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు

పార్వతీపురం టౌన్: పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు అన్నారు. పురపాలక సంఘం కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు వెలుపల, ఎదురుగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హోం కంపోస్టులను పరిశీలించామని, హోం కంపోస్టు తయారీ విధానాన్ని వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించినట్టు చెప్పారు. ఇదే విధంగా స్కూల్, కళాశాలలు తదితర ప్రాంతాల్లో హోం కంపోస్టు తయారీకి ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట డీఈ కిరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ మేస్త్రీ సాయి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి : కలెక్టర్



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చిన్న పిల్లల విభాగం, మెటర్నటీ, లేబర్ వార్డు, ఎస్ఎన్‌సీయూ, డయాలసిస్ విభాగాలను పరిశీలించారు. ప్రసూతి విభాగంలో బాలింతలతో మాట్లాడారు. సమయానికి సక్రమంగా భోజనం అందిస్తున్నదీ లేనిది, అందుతున్న వైద్యం, పర్యవేక్షణ తదితర అంశాలను ప్రశ్నించి ఆరా తీశారు. రెండు పూటలా పరీక్షిస్తున్నామని వైద్యులు కలెక్టర్‌కు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న పిల్లల విభాగంలో జ్వరాలతో ఆస్పత్రిలో చేరిన చిన్నారులను పరిశీలించారు. కేస్ షీట్ పరిశీలించి మలేరియా జ్వరం ట్రీట్‌మెంట్, రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయొద్దు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్తవలసలో సర్వే నంబరు 125లో 3.69 ఎకరాల్లో గల వెంకటరమణ రియల్ ఎస్టేట్, బెలగాంలోని సర్వే నంబరు 458/1బీలో 2.56 ఎకరాల్లో ఉన్న సాయి గార్డెన్ డెవలపర్స్‌లో స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లేఅవుట్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతుల్లేవని తెలిపారు. ఎవరైనా కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్లు జరగవని, మున్సిపాలిటీ నుంచి భవన నిర్మాణానికి ఎటువంటి అనుమతులు రావని, మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించబడవని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

కొమరాడ: మండలంలోని దంగభద్ర గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్ఐ నీలకంఠం తెలిపారు. వీరి నుంచి రూ.47వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ఫొటోలు అప్లోడ్ చేసే బాధ్యత నుంచి హెచ్‌ఎంలను తప్పించాలి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలు అప్లోడ్ చేసే బాధ్యత నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించినట్లే తప్పించి ప్రతి రోజు సాయంత్రంలోగా సర్వే ఫార్మేట్‌ని అప్లోడ్ చేయమనడం సహేతుకం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో నిరసన తెలిపారు. యూరినల్స్, టాయిలెట్లు, వాష్ బేసిన్లు గ్రౌండ్‌కు సంబంధించి శుభ్రపరిచే రసాయనాలు, పరికరాల గురించి, ఆయా పని చేసింది లేనిది, రోజుకి ఎన్నిసార్లు శుభ్రం చేయడం జరిగింది, ఏ సమయంలో శుభ్రం చేశారు, తదితర వివరాలను ప్రతీరోజూ సాయంత్రంలోగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాప్ ద్వారా పంపమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులైన పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులను, వైస్ చైర్మన్, చైర్మన్‌లను ఐఎంఎంఎస్ యాప్ ద్వారా టాయిలెట్స్ ఫొటోలు తీయమని చెప్పడం, ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగానే ఉంటుందన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీని అగౌరవ పరుస్తున్నామనే భావన వారిలో కలిగే అవకాశం ఉండడం వల్ల ఇన్ని ఇబ్బందులతో ప్రధానోపాధ్యాయులు నెట్టుకు రావడం కష్టసాధ్యమని, టాయిలెట్ మెయింటెనెన్స్ పూర్తి బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



మక్కువ జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు

మక్కువ: మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని సీఆర్‌పీఎఫ్ డీ–198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి.కృష్ణారావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిసరాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో బలగాలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన కోరారు. విద్యార్థులు దేశ సేవలో పాల్గొనేందుకు ఆసక్తి చూపించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నరసింహమూర్తి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కుమార్‌శాస్త్రి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: కోల్‌కత్తాలోని వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మండలంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు, ఆటో జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. మహిళలకు రక్షణ కల్పించాలి...నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి డి.పండు, మండల కార్యదర్శి కె.డేవిడ్, హరీష్, టి.గణేష్, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు: మహిళా రక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ పట్టణంలో బుధవారం ర్యాలీ, రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ మహిళలపై ప్రతీ రోజు ఏదో ఒక చోట హత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రక్షణ చట్టాలు బలహీనంగా ఉండడం వల్ల ఇలా జరుగుతున్నాయని చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాముడు, వెంకటరావు, ఐద్వా నాయకురాలు గంగమ్మ, కొత్తమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు శంకరరావు, వాసు, కేశవ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

వీఏఏల శాలరీ నుంచి రికవరీ

- జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్ పాల్

వీరఘట్టం: రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించిన యూరియా, డీఏపీ డబ్బులను జిల్లాలోని ఎనిమిది మంది వీఏఏలు సొంత అవసరాలకు వినియోగించుకోవడంతో వారి శాలరీ నుంచి ఆ డబ్బులను రికవరీ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. బుధవారం వీరఘట్టం వచ్చిన ఆయన వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. అలాగే రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ – పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. అంతకు ముందు వీరఘట్టం మండలం చిట్టపులివలస గ్రామంలో చేపట్టిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ పాలకొండ ఏడీఏ కె.రత్నకుమారి, మండల వ్యవసాయ శాఖాధికారి జె.సౌజన్య, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌తో ఉపాధి

- నిరుద్యోగ యువత, ఔత్సాహికులకు బాసటగా..
- గొర్రెలు, పందులు, కోళ్లు, మేకల పెంపకానికి రుణాలు



మూగజీవాల యూనిట్

పాలకొండ రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిరుద్యోగ యువత అవకాశాలు అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వ పరంగా అందుతున్న రాయితీలపై అవగాహన పెంచుకోవాలి. ఔత్సాహిక రైతులు, నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపించేందుకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం), పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఎన్ఎల్ఎం పథకాన్ని రూపొందించింది. గొర్రెలు, కోళ్లు, పందులు, తదితర జీవాల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీతో ఉపాధి కల్పించుకునేందుకు ఈ పథకానికి రంగం సిద్ధం చేసింది.

భారీగా రాయితీలు..

500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రెలు లేదా మేకపిల్లల ఉత్పత్తి, పోషణ చేపడతారు. ప్రాజెక్ట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తున్నారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.

కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా....

కోళ్ల అభివృద్ధికి సంబంధించి తక్కువ వ్యయంతో సాయం అందిస్తారు. వెయ్యి కోడి పెట్టలు, వంద కోడిపుంజులతో పెరటి కోళ్ల యూనిట్ ఉంటుంది. కోడి పిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్లు ఉత్పత్తి కోసం రూ.50 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే గరిష్ఠంగా రూ.25 లక్షల రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ ఇస్తారు.

యూనిట్ వివరాలు	సబ్సిడీ రూ.లక్షల్లో
100 గొర్రెలు లేదా మేకలు, 5 పొట్టేళ్లు లేదా మేక పోతులు	10
200 గొర్రెలు లేదా మేకలు, 10 పొట్టేళ్లు లేదా మేకపోతులు	20
300 గొర్రెలు లేదా మేకలు, 15 పొట్టేళ్లు లేదా మేకపోతులు	30
400 గొర్రెలు లేదా మేకలు, 20 పొట్టేళ్లు లేదా మేకపోతులు	40
500 గొర్రెలు లేదా మేకలు, 25 పొట్టేళ్లు లేదా మేకపోతులు	50

పందుల పెంపకం..

వంద ఆడ పందులు, 10 మగ పందులతో యూనిట్ ఏర్పాటు చేయవచ్చు. ప్రాజెక్ట్ విలువ రూ.60 లక్షలు, అంతకుమించి ఉంటే గరిష్ఠంగా రూ.30 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం.. అలాగే 50 ఆడ పందులు, 5 మగ పందుల యూనిట్‌కు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు రాయితీ ఇస్తారు.

దాణాకు సంబంధించి..

పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజీ తయారీ, పశుగ్రాస దిమ్మెల తయారీ, సమీకృత దాణా తయారీ యూనిట్లకు ఆర్థిక సాయం చేస్తారు. యూనిట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు.

అర్హుల ఎంపిక ఇలా.....

- అనుభవం ఉన్న వ్యక్తిగత పశుపోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్–8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.
- లబ్ధిదారులు సంబంధిత ప్రాజెక్ట్‌లో శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్ట్ నిర్వహణపై అవగాహన అవసరం.
- రాయితీ పోను మిగిలిన యూనిట్ విలువను బ్యాంక్ రుణంగా పొందడానికి అవసరమైన పత్రాలను సమర్పించాలి. బ్యాంక్ అనుమతి తప్పనిసరి.
- మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్ట్ నివేదిక తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- సొంత లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలి. వీటిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం అర్హతలున్న వారిని ఎంపిక చేసి, జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌కు పంపిస్తారు.
- రెండు విడతల్లో రాయితీ విడుదల చేశారు.
- బ్యాంక్ మొదటి దశ రుణం లబ్ధిదారులకు అందిందనే విషయాన్ని ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని సంబంధిత బ్యాంక్‌కు జమ చేస్తారు. ఆ సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాలో ఆ బ్యాంక్ జమ చేస్తుంది.
- ప్రాజెక్ట్ మొత్తం పూర్తయిన తర్వాత అధికారులు ధ్రువీకరించుకుని రెండో దఫా సబ్సిడీ కూడా లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి..



ఔత్సాహికులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి. జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకంపై గ్రామీణ యువతకు, ఆసక్తిగల రైతులకు రైతుసేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై రైతులకు క్షుణ్ణంగా వివరిస్తున్నాం. అలాగే గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేపడుతున్నాం. మండలానికి 200 యూనిట్లు నెలకొల్పనున్నాం. తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. httpr.dahd. nic.i n వెబ్‌సైట్ ద్వారా నేరుగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు.

డాక్టర్ శివ్వాల మన్మథరావు, పశుసంవర్థకశాఖ జె.డి, పార్వతీపురం మన్యం

పరిశీలన

పాలకొండ: బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ బూత్ లెవెల్లో చేపడుతున్న సమాచారం అందుబాటులో ఉంచాలని తెలిపారు.

CHANGE OF NAME

I **Ch.Kavya** D/o **CH.Madhusudan** aged 17years, Resident of D.No. 1-32, Gutchimi Village and Panchayat, Seethanagaram Mandal, Parvathipuram Manyam District, Andhra Pradesh 535546. Have my father name incorrectly spelt as **CH.Madhusudan** in my CBSE 10th Certificate. The correct spelling of his name is **Chellarapu Madusudanarao** and should be considered so for all purposes.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పార్వతీపురం / సాలూరు

9010204441, 9951602891

Office mail : vzmadvt@gmail.com